

చంద్రబాబు నాయుడును కలిసిన ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బరాయన్, ప్రధాన కార్యదర్శి పెద్దన్న గౌడ్, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మునయ్య విజయవాడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం కలిశారు. తమ పార్టీ అజెండాను, డిమాండ్లను ఆయనకు తెలియజేసినట్లు వారు తెలిపారు. పెన్షనర్లకు ప్రతినెలా 1వ తేదీనే పెన్షన్ ఇవ్వాలని, క్వాంటం ఆఫ్ పెన్షన్ 10 శాతం పెంచాలని, డిఎ అరియర్స్‌ను చెల్లించాలని, మదనపల్లెను జిల్లా కేంద్రంగా చేస్తామని ప్రస్తుత తెలుగుదేశం పార్టీ అభ్యర్థి షాజహాన్ బాష తెలియజేశారని పేర్కొన్నారు అందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం చంద్రబాబు నాయుడు స్పందిస్తూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు వరదరాజులు పాల్గొన్నారు.

నేను లోకల్!

కాంట్రాక్టు పోస్టుల భర్తీ ప్రక్రియలో నాన్‌లోకల్..లోకల్, నాన్(డీ) మెరిట్..మెరిట్, ఓపెన్ కేటగిరీ...రిజర్వేషన్.. సర్వీస్ మార్కులు కలపడం, సర్టిఫికెట్ల లాగ్వేజ్ మార్కులు ఒకరికి కలపడం. మరొకరికి కలకపోవడం వంటి విన్యాసాల పరంపర కొనసాగుతోంది. దీనిపై పలువురు అర్హులైన అభ్యర్థులు జిఎంసి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటువంటి విన్యాసాల నేపథ్యంలో జిఎంసి అధికార యంత్రాంగం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుండడం ఆందోళన కలిగి స్తోంది. దీనిపై స్పందించాల్సిన కలెక్టర్ చోద్యం చూస్తుండడం నిరుద్యోగ లోకం నివ్వెరపోతోంది.

- రివైజ్డ్ ఫైనల్ లిస్టులో నాన్‌లోకల్..లోకలే
- కాంపొనెంట్ పదం లేదనే సాకుతో టెక్నీషియన్‌కు మొండిచేయి
- సర్వీస్ మార్కులు లేవనే పేరుతో ఓ థెరపిస్ట్‌కు నిరాకరణ
- అవకతవకలకు కేరాఫ్ ఆ ముగ్గురే?
- నిద్రావస్థలో జిఎంసి యంత్రాంగం



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కాంట్రాక్టు పోస్టుల భర్తీలో అవకతవకల పర్వం కొనసాగుతూనే ఉంది. 2023 డిసెంబర్‌లో జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల, మానసిక, కేన్సర్ కేర్, పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని 14 కేటగిరీలకు చెందిన 196 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈమేరకు జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాల యంత్రాంగం పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగా మొదట రివైజ్డ్ ఫైనల్ లిస్టు పెట్టకుండా సెలెక్షన్ లిస్టు ప్రకటించడంపై ఆందోళన నెలకొనడం, రిజర్వేషన్ల గుర్తింపు దగ్గర నుంచి, ఆయా పోస్టులకు అర్హతలు నిర్ధారించడంలో విఫలం కావడంతో ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో డిప్యూటీ సిఎం స్పందించడంతో కలెక్టర్ మరోసారి సర్టిఫికెట్ల పరిశీలన, రిజర్వేషన్ అర్హతల నిర్ధారణకు పలువురు జిల్లా ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులోనూ కేన్సర్ కేర్ విభాగానికి సంబంధించిన రెండు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు ఇద్దరు స్థానిక జిజిహెచ్‌లోని బ్లడ్‌బ్యాంకు సహచర ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మెరిట్ మార్కులు కలిగిన అభ్యర్థికి డిఎంహెచ్‌ఒ ఇచ్చిన సర్టిఫికెట్‌లో కాంపొనెంట్ అనే పదం లేదనే పేరుతో నిరాకరించడం గమనార్హం. ఇందులో తక్కువ మార్కులు కలిగిన ఓ రిజర్వేషన్ కేటగిరీకి చెందిన ఓ ఉద్యోగిని ఓపెన్ కేటగిరీలో సెలెక్షన్ లిస్టుకు ఎంపిక చేశారు. ఎస్‌సి కేటగిరీ పోస్టును వేకెంట్‌గా చూపించడం చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో స్థానిక జిజిహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఫిజియోథెరపిస్ట్‌కు సర్వీస్ మార్కులు కలపకుండా సెలెక్షన్ లిస్టులో మొండి చేయి చూపించడం గమనార్హం. ఇంతటితో ఆగకుండా పులివెందుల మెడికల్ కళాశాలకు చెందిన ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఓ దరఖాస్తుదారు నాన్‌లోకల్ కేటగిరీ అయితే లోకల్ కేటగిరీ కింద ఎంపిక చేసినట్లు సమాచారం. దీంతో సదరు యువకుడు తేరుకుని సర్టిఫికెట్లు అందజేయడానికి ఆలస్యంగా జిఎంసి చుట్టూ చక్కర్లు కొడుతుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. కలెక్టర్ నియమించిన జిల్లా ఉన్న తాధికారుల బృందం సర్టిఫికెట్లు వెర్ఫికేషన్, రిజర్వేషన్ తదితర అంశాల ఆధారంగా పరిశీలించి రివైజ్డ్ ఫైనల్ లిస్టులోనూ అవకతవకలు కొనసాగడం విస్మయాన్ని కలిగిస్తోంది.

ఆ ముగ్గురితోనే అవకతవకలు?

కాంట్రాక్టు పోస్టుల భర్తీ ప్రక్రియలో ఫైనల్ లిస్టులో ఓ ల్యాబ్ టెక్నీషి యన్, సూపరింటెండెంట్ సహా మరో ఉద్యోగి కీలకపాత్ర పోషించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులోని ఓ ల్యాబ్ టెక్నీషియన్ బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ పోస్టుకు మార్కులను ఒకరికి కలపడం, మరొకరికి కలపకపోవడం, రిజర్వేషన్ కేటగిరీలను సైతం మార్చేశారనే విమర్శలు ఉన్నాయి. ఎస్‌సి కేటగిరీ అభ్యర్థికి ఓసి కేటగిరీ పోస్టుకు ఎంపిక చేయడం, ఎస్‌సి కేటగిరీ పోస్టును వేకెంట్‌గా చూపించ డమేమిటనే విమర్శ వినిపి స్తోంది. వీరికి జిఎంసి ప్రిన్సిపాల్ వంత పాడటం విస్మయాన్ని కలిగిస్తోంది.

గ్రీవెన్స్‌ను అడ్రస్ చేయండి

కాంట్రాక్టు పోస్టుల భర్తీలో ఆలస్యంగా వెలుగులోకి వస్తున్న గ్రీవెన్స్‌ను పరిష్కరించిన తరువాత సెలెక్షన్ లిస్టు పెట్టాలి. కేన్సర్‌కేర్ విభాగంలోని ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టు దరఖాస్తుదారుకు డిఎంహెచ్ఒ జారీ చేసిన సర్టి ఫికెట్‌లో కాంప్లెక్స్ అనే పదం లేదనే పేరుతో నిరాకరించడం దారుణం. తాజాగా డిఎంహెచ్‌ఓ ఇచ్చిన సర్టిఫికెట్ అర్థమైనదైతే పరిశీలించాలి. సదరు వేకెంట్ పోస్టును భర్తీ చేయాలి. సర్వీసు మార్కులు కలపకుండానే జిజిహెచ్‌కు చెందిన ఓ ఫిజియోథెరపిస్ట్‌కు మొండిచేయి చూపించడం తగదు.

-బి.మనోహర్, జిజిహెచ్ మెడికల్ యూనియన్ నాయకులు, కడప.

మాధవరం 'ఆత్మహత్య'లపై విచారణకు ఆదేశించాలి

- కారకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- తహశీల్దార్, ఆర్‌డిఒపై చర్యలు తీసుకోవాలి
- బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్ డిమాండ్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎం.ఎ. గఫూర్, నాయకులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ ఒంటిమిట్ట

కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం చేనేత కుటుంబ ఆత్మహత్య ఘటన కారకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ గఫూర్ డిమాండ్ చేశారు. ఆదివారం మధ్యాహ్నం సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్ర శేఖర్ బృందంతో కలిసి మాధవరంలో శనివారం ఆత్మహత్యకు పాల్ప డిన సుబ్బారావు కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం ఆత్మ హత్యకు దారి తీసిన కారణాలను మృతుని కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబీకుల దగ్గర ఉన్న పొలానికి సంబంధించిన డాక్యుమెంట్లను ఇతర ఆధారాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ 2015లో ఒంటిమిట్ట పొలం పరిధిలోని సర్వే నెంబర్ 218.2, ఖాతా నెంబర్ 1712లో 2.10 ఎకరాల పొలాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గ వైసిపి నేతల అనుచరులు అప్పటి తహశీల్దార్, ఆర్డీఓల సహకారంతో సుమారు 600 ఎక రాలపైగా రెవెన్యూ రికార్డుల్లో పేర్లు తొలగించి అన ర్హుల పేర్లతో ఎక్కించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. ఇందులోని నిజానిజాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సొంత జిల్లాలో చోటుచేసుకున్న భూకబ్జాతో నిండు కుటుంబం బలి కావడంపై స్పందించాల్సిన అవ సరం ఉందన్నారు. కుటుంబ సభ్యుల ఆత్మహత్యలపై సమగ్ర విచా రణ చేపట్టి, బాధ్యులైన అధికారులు, సొంత పార్టీ నాయకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో చోటుచేసుకునే ఇటువంటి దురాగతాలకు వైసిపి సర్కారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. **అండగా ఉంటాం :** మాధవరం ఆత్మహత్య కుటుంబ సభ్యులకు ఉంటామని ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. మీ తరుపున సిపిఎం పోరాటం చేస్తుందని, సాధ్యమైన మేరకు న్యాయం చేయడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఇందులోభాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి విచారణకు ఆదేశించాలని కలెక్టర్‌ను కోరతామన్నారు. మీ పొలం మీకు దక్కేలా ప్రయత్నించడంతోపాటు బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం తక్షణమే అందజేయాలని కోరతా మని తెలిపారు. ఆత్మహత్యలకు దారి తీసిన ఘటనకు గల కారణా లను పరిశీలన అనంతరం పిఎం కిసాన్ నిధులు జమ దగ్గర నుంచి మీ కుటుంబ అప్పుల అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఆయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మో హన్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, ఒంటిమిట్ట, సిద్ధ వటం మండల కార్యదర్శులు కోనేటి నరసయ్య సురేష్‌బాబు పాల్గొన్నారు.

అప్పుల వల్లే ఆత్మహత్య : డిఎస్‌పి

పాల సుబ్బా రావు, భార్య, కుమార్తె అప్పుల బాధతోనే ఆత్మ హత్యకు పాల్పడ్డారని కడప డిఎస్‌పి ఎం.డి. షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు వచ్చిన రిపోర్టు ప్రకారం మృతులు మత్తుమందు తాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. పైగా మృతుడుపాల సుబ్బా రావుకు రియల్ ఎస్టేట్ వ్యాపారంతో సంబం ధాలున్నాయని, అప్పుల బాధ తటు కోలేక మాన సికంగా కుంగి ఆత్మ హత్యలకు పాల్పడినట్లు సమాచారం వచ్చిందన్నారు. ఆర్‌డిఒతో మాట్లాడితే పాల సుబ్బారావు భూమిని ఎవరికీ పట్టా ఇవ్వలేదని సమా ధానమిచ్చారని చెప్పారు.



మాట్లాడుతున్న కడప డిఎస్‌పి

వందశాతం న్యాయం చేస్తాం : జడ్‌పి చైర్మన్

బాధిత కుటుంబానికి వందశాతం న్యాయం చేస్తామని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. మృతుల కుటుంబాలను పరామ ర్శించారు. కుటుంబంలో పెద్ద కుమార్తెకు ఉద్యోగం కల్పిస్తామని, ఏ భూమికోసం ఆత్మహత్య చేసుకున్నా అదే భూమిని బాధిత కుటుంబానికి పట్టా రూపంలో ఇప్పించే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్

రూ.50 వేల ఆర్థిక సాయం : టిడిపి

పాల సుబ్బారావు కుటుంబానికి రాజంపేట టిడిపి నాయకులు బత్యాల చెంగల రాయుడు పార్టీ తరుపున రూ. 50 వేల ఆర్థిక సాయం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలా ఆదుకుంటామని సుబ్బా రావు పెద్ద కుమార్తె లక్ష్మిప్రసన్నకు భరోసా ఇచ్చారు. వైసిపి ప్రభుత్వంలో భూ కబ్జాలు అధికమయ్యాయని, పేద కుటుంబాలతో చెలగాటమాడుతోందని వాపోయారు. టిడిపి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేస్తామని పేర్కొన్నారు.



లక్ష్మీప్రసన్నను పరామర్శిస్తున్న బత్యాల

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం : సిపిఐ

బాధిత కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని సిపిఐ రాష్ట్ర నాయకులు ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం మృతుల కుటుంబాన్ని పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు

అన్ని విధాలా ఆదుకుంటాం : జనసేన

మృతుల కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాజంపేట జనసేన నాయకులు అతికారి దినేష్ పేర్కొన్నారు. పాలసుబ్బారావు పెద్ద కుమార్తె లక్ష్మి ప్రసన్నకు రూ.30 వేల ఆర్థిక సాయం చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌తో మాట్లాడి ఆమెను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

గంజాయి, డ్రగ్స్ రవాణాలో ఎపి అగ్రస్థానం : టిడిపి

ప్రజాశక్తి-పీలేరు

తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో రాష్ట్రం పెట్టుబడుల ఆకర్షణలో ప్రథమ స్థానంలో ఉండేదని, వైసిపి ప్రభుత్వ పాలనలో ఆంధ్ర రాష్ట్రం గంజాయి, డ్రగ్ రవాణాలో అగ్రస్థానంలో నిలిచిందని టిడిపి శ్రేణులు విమర్శించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ కేంద్రంగా పట్టుబడిన కంటైనర్లో మార్ఫిన్, కొకైన్, హెరాయిన్, యాంఫటేమిన్, మెస్కిలన్ వంటి ప్రమాదకర మత్తు పదార్థాలున్నాయని సిబిఐ తన నివేదికలో పేర్కొందని అన్నారు. గతంలో విజయవాడలో ఆశి ట్రేడర్స్ పేరుతో ముంద్రా పోర్టులో రూ. 21 వేల కోట్ల విలువైన హెరాయిన్ దిగుమతిలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. ఇప్పుడు ఏకంగా డ్రై ఈస్ట్‌తో కలిపి రూ.50వేల కోట్లు విలువైన 25 వేల కిలోల అత్యంత ప్రమాదకరమైన డ్రగ్స్ దొరకడం అందరినీ ఆశ్చర్య పరచిందన్నారు. ఇన్నాళ్లూ రాష్ట్ర ప్రజలకు కల్తీ మద్యం అమ్మి వారి ఇల్లూ, ఒళ్లూ గుల్ల చేసి, అనారోగ్యాల పాలు చేశారని చెప్పారు. ఇప్పుడు గంజాయి, డ్రగ్స్, కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని కేపిటల్‌గా మారు స్తున్నారని ఆరోపించారు. యువత జగన్మోహన్ రెడ్డి దోపిడీని ప్రశ్నించకుండా, నిలదీయకుండా ఉండడం కోసం వారిని మత్తులో దించి గేమింగ్ క్యాసినోతో జాతిని నిర్వీర్యానికి కుట్ర పన్నుతూ తల్లిదండ్రులకు కడుపు కోత మిగిలిస్తున్నాడని విమర్శించారు. సోషల్ మీడియా ద్వారా ఆ పాపాన్ని ఉద్దేశపూర్వకంగా తెలుగుదేశం పార్టీకి ఆపాదించే కుట్ర చేస్తున్నారని అన్నారు. సమావేశంలో రాష్ట్ర బిసి కార్యదర్శి పురం రామ్మూర్తి, మాజీ మండల అధ్యక్షులు ఎన్. అమరనాథరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు యల్లెల రెడ్డెప్పరెడ్డి, పట్టణ అధ్యక్షులు సురేష్ కుమార్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి లక్ష్మీకర, ప్రముఖనేత కొత్తపల్లి శ్రీనాథ్ రెడ్డి, గాజుల రవికుమార్, రమణారెడ్డి, శివారెడ్డి, పిలేరు నియోజకవర్గ అధికార ప్రతినిధి స్పోర్ట్స్ మల్లి, మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లారి రియాజ్. ఖాదర్, పురుషోత్తం రెడ్డి, గాండ్ల విజయ్ కుమార్, హనీఫ్, ఖాదర్, టిఎన్ఎస్ఎఫ్ ముబారక్, రెడ్డి ముని, క్రాంతి, వెంకటేష్ కృష్ణయ్య, వెంకట రమణా నాయక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

జగన్ ప్రభుత్వం డ్రగ్స్, భూ మాఫియాలను పెంచి పోషిస్తుంది : 'మండిపల్లి'

రాయచోటి : వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం డ్రగ్స్, భూ మాఫియాను పెంచి పోషిస్తుందని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎస్ఎన్ కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి హయంలో పెట్టుబడుల ఆకర్షణలో నెంబర్ వన్ స్థానంలో ఉన్న ఎపి జగన్ రెడ్డి గంజాయి, డ్రగ్స్ రవాణాలో నెంబర్ వన్ స్థానానికి చేర్చారని విమర్శించారు. విశాఖను రాజధాని చేస్తానని చెప్పి, డ్రగ్ క్యాపిటల్‌గా మార్చాడని వాపోయారు. కల్తీ మద్యం మాఫియాతో ఇన్నాళ్లు ప్రజలు ప్రాణాలతో చెలగాటమాడారని, రాష్ట్రంలో జగన్ రెడ్డి ప్రభుత్వం అన్ని విధాల విఫలమైంది ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రజలు ఆరోగ్యాలతో జగన్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని మద్యంతోనే చాలామంది ఆసుపత్రిపాలై మృతి చెందుతుంటే మధ్యకాలంలో ఎక్కడ చూసినా రాష్ట్రంలో గంజాయి డ్రగ్స్ ఎక్కువ అయ్యాయన్నారు. రాష్ట్ర ప్రజలు ఎన్నికల్లో జగన్‌కు తగిన బుద్ధి చెప్పి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలన్నారు.

రాజంపేట బిజెపి ఎంపీ అభ్యర్థిగా కిరణ్‌కుమార్‌రెడ్డి

రైల్వేకోడూరు జనసేన అభ్యర్థిగా వై.భాస్కర్‌రావు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



రాజంపేట పార్లమెంట్ బరిలో మాజీ ముఖ్య మంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నిలవనున్నారు. ఆదివారం రాత్రి బిజెపి ఐదో విడత విడుదల చేసిన జాబితాలో వెల్లడించింది. నెల రోజులుగా సాగిన ఊహా గానాలకు తెరప డింది. రాజంపేట పార్ల మెంట్ వివరాలను పరిశీలిస్తే 20 14లో రాజంపేట పార్లమెంట్ బరిలో బిజెపి తరుపున ప్రస్తుత బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పోటీ చేసి ఓడిపోయిన సంగ తి తెలిసిందే. ఇటువంటి అనుభవాల నేపథ్యంలో రాజంపేట వైసిపి పార్ల మెంట్ అభ్యర్థి పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డిని బలంగా ఢీకొనడంలో భాగంగా సుదీర్ఘంగా అన్వేషించినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా ప్రతిపక్ష, అధికార పక్ష నాయకులతో సత్సంబంధాలు, బంధుత్వాలు, స్థానికత్వం, సామా జిక, ఆర్థిక, అంగబలాల ఆధారంగా ఎంపిక చేసినట్లు తెలు స్తోంది.

జనసేన అసెంబ్లీ అభ్యర్థిగా భాస్కర్‌రావు



అన్నమయ్య జిల్లా పరిధిలోని రైల్వేకోడూరు జనసేన అసెంబ్లీ అభ్యర్థిగా యనమల భాస్కర్‌రావు పేరును ప్రకటించింది. ఎస్‌సి రిజ ర్వ్డ్ నియోజకవర్గం కావడంతో సుదీర్ఘ అన్వేషణ సాగించినట్లు తెలు స్తోంది. అన్నమయ్య జిల్లాలో రైల్వేకోడూరు నియోజకవర్గ టికెట్ జన సేన దక్కడం గమనార్హం. దీంతో టిడిపి తరుపున టికెట్ ఆశా వహు లకు తీవ్ర నిరాశను కలిగించింది. 2009 నుంచి 2024 సార్వ త్రిక ఎన్నికల వరకు అప్రతిహత విజయాలు సాధిస్తున్న వైసిపి అభ్యర్థిగా ఢీకొట్టడంలో భాగంగా టిడిపి, బిజెపి, జనసేన కూటమి తరుపున యనమల భాస్కర్‌రావు పేరును ప్రకటించినట్లు తెలుస్తోంది. ఊహిం చని పేరును తెరపైకి రావడంతో తుదిపోరుకు తెరలేచినట్లు తెలుస్తోంది.

'మనాలీ స్మృతులు' గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె మహిళా డిగ్రీ కళాశాల ఆంగ్ల ఉపన్యాసకురాలైన జింకల మోహనవల్లి రచించిన 'మనాలీ స్మృతులు' గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రజా చైతన్య స్రవంతి వారి ఆధ్వర్యంలో జ్ఞానోదయ పాఠశాల సెంట్రల్‌లో నిర్వహించారు. కవయిత్రి, గాయని మాకం ప్రసన్నలక్ష్మి ప్రార్థనతో సభ ప్రారంభమైంది. అధ్యక్షత వహించిన డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు హిమాలయ పర్వతాలలోని మనాలిలో ఎన్ఎస్ఎస్ క్యాంపులో పాల్గొన్న మోహన్‌వల్లి తమ అనుభవాలను అద్భుతంగా గ్రంథ రూపంలోకి తీసుకు వచ్చారని చెప్పారు. రచయిత, సాహితీ విమర్శకులు వేంపల్లి సికిందర్ గ్రంథావిష్కరణ చేసి హిమాలయాలలో తాము మనాలిలో పర్యటించిన జ్ఞాపకాలను సభికులకు నివేదించారు. కథ, నవలా రచయిత సాహితీ సద్విమర్శకులు టి.ఎస్. కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎలెక్స్ హేలి, ఎం.ఆదినారాయణ, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, మధురాంతకం నరేంద్ర మొదలైన వారి రచనల బాటలో సాగిన 'మనాలి స్మృతులు' గ్రంథం గురించి వివరించారు. ముఖ్య అతిథి జ్ఞానోదయ ప్రసాదరావు గ్రంథంలోని రచయిత్రి అనుభవాలతో కొన్ని తమ జీవితంలో కూడా జరిగిన వైనాన్ని వివరించారు. ఎం. శ్రీనివాసులు ప్రసంగిస్తూ సమాజంలో ఎవరినైనా ప్రోత్సహించడానికి సామాజిక స్పృహ కలిగిన వారందరూ ముందుకు రావాలని తెలిపారు. రచయిత్రి జింకల మోహన వల్లి తమ విద్యాభ్యాసం మధ్యలో వివాహం చేసుకున్నారని, భర్త ప్రోత్సాహంతో ఒక్కో అడుగు ముందుకు వేసుకుంటూ పిహెచ్‌డి స్థాయికి ఎదగారని చెప్పారు. హార్సిలీ కొండలలో ఎన్ఎస్ఎస్ క్యాంపుతో మొదలుపెట్టి హిమాలయ పర్యటన వరకు తమ అనుభవాలను వివరిస్తూ వాటిలో కొన్నింటిని గ్రంథంలో పొందు పరిచామని తెలియ చేశారు. అనంతరం విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, కొడవటి ప్రభాకర్, జి.బాలాజీ, పండిత వాసా కృష్ణమూర్తి, ఆలూరి సురేష్, కురలి వెంకటరమణ, డాక్టర్ టి.టీ.పి. మోహన్ బాబు, డాక్టర్ గురుమూర్తి, ఉమా శంకర్, గణేష్ విద్యార్థి, డాక్టర్ రమణాచారిణాచారి, వి.ఎం నాగరాజా ప్రసంగించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

హక్కుల కోసం పోరాడుదాం : మాలమహానాడు

ప్రజాశక్తి-పీలేరు

రాజ్యాంగబద్ధంగా మాలలకు అందాల్సిన సంక్షేమ, అభివృద్ధి పథకాల కోసం పోరాటం సాగిద్దామని మాల మహానాడు నాయకులు అన్నారు. ఆదివారం పీలేరు మండల ప్రచార కార్యదర్శి దప్పేపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున అధ్యక్షతన భారత రత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, మాలమహానాడు వ్యవస్థాపకులు పి.వి రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనంతరం సమావేశానికి ముఖ్య అతిథులుగా మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, మాలమహానాడు రాయలసీమ జిల్లాల సహాయ కార్యదర్శి నగరిమడుగు సుభాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సినఅనేక సంక్షేమ పథకాలు రద్దుచేసి, మాలల వల్లనే అధికారంలోకి వచ్చామన్న సంగతి మరచి అరాచక, కుల దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సైతం నిర్వీర్యం చేసిన ప్రభుత్వాలను మాల ప్రజా ప్రతినిధులు, మాల రాజకీయ నాయకులు ఎదిరించి మన హక్కులను సాధించలేక పోవడం తీరని నష్టమని మాల మహానాడు సీనియర్ నాయకులు కె, గట్టప్ప ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పీలేరు మండల మాలమహానాడు నూతన కమిటీ ఏర్పాటైంది. మండల అధ్యక్షులుగా గుండ్లూరు రవీంద్ర, మండల ప్రధాన కార్యదర్శిగా బద్దె భాను ప్రకాష్, మండల గౌరవ అధ్యక్షులుగా మల్లేపల్లి చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా గుర్రం లోకనాథం, జెట్టి రాజశేఖర్, కార్యదర్శిగా టంగుటూరి శేషాద్రి, ప్రచార కార్యదర్శిగా టంగుటూరి ప్రభు తేజ, సహాయ కార్యదర్శులుగా దప్పేపల్లి ఆనంద్, గుండ్లూరి నాగేంద్ర, డివి రమణ, కోశాదికారిగా కె. చిరంజీవి, అధికార ప్రతినిధులుగా తుమ్మల రవి కుమార్, మద్దెల హరి బాబు, కార్యవర్గ సభ్యులుగా జి, రెడ్డెప్ప, కె, రాజన్న, యస్, గణేష్, జి, గంగయ్య, ఎ, రెడ్డెప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ఎన్నికైన మాలమహానాడు నూతన కమిటీ

అంబరాన్నంటిన హోలీ సంబరాలు

ప్రజాశక్తి - రాయచోటి

బంజారాలా సుగాలీల పండగ హోలీ అని, జాతి ఐక్యత కోసం అందరం కలిసికట్టుగా పనిచేసి ముందుకెళ్దాం అని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు అమృనాయక్ పిలుపు నిచ్చారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఫయాజ్ ఫంక్షన్ హాల్‌లో మొట్ట మొదటిసారిగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వ ర్యంలో హోలీ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ మన జాతి, సంస్కృతి సాంప్రదాయలను కాపా డుకుంటూ రాబోయే తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మన పిల్లలను బాగా చదివించుకొని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో ముందుకెళ్లాలన్నారు. మన పిల్లలను బాగా చదివించి పేదరికం దూరం చేసుకోవాలన్నారు. ఆలిండియా బంజారా సేవా సంఘం బంజారాల, సుగాలీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఆటపాటలతో అలరించిన బంజారా జానపద కళాకారులు ఆల్ ఇండి యా బంజారా సేవా సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ సంబరాలలో ప్రముఖ బంజారా కళాకారుడు భిక్షు నాయక్ వారి బృందం బంజారాల ఆటపాటలతో అందరిలో ఉత్సాహన్ని నింపారు. అంతకుముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సేవలాల్ చిత్రపటా లకు ముఖ్య అతిథులు పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆలిం డియా బంజారా సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏం రామ్మూర్తి నాయక్, లేబర్ డిపార్ట్మెంట్ డిప్యూ టీ కమిషనర్ బాలు నాయక్, పిఆర్ ఇఇ రామచంద్రనాయక్, ఎంపి డిఒ శేఖర్ నాయక్, ఐఐయస్ ధర్మ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బిల్లు నాయక్, ట్రెజరర్ నారాయణ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్ర శేఖర్ నాయక్, గిరిజన సంఘ నాయకులు విశ్వనాథ నాయక్, శంకర్ నాయక్, సంఘ ప్రతినిధులు రామ్మూర్తి నాయక్, రెడ్డి నాయక్, అశోక్ నాయక్ పాల్గొన్నారు.



హోలీ సందర్భంగా బంజారా నృత్యం చేస్తున్న మహిళలు

స్కౌట్స్ ఏర్పాటుకు సమిష్టి సహకారం అవసరం

ప్రజాశక్తి-మదనపల్లి

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విస్తరణకు సమిష్టి సహకారం అవసరమని స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ చంద్రశేఖర్, అన్నమయ్య జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం జిఆర్‌టి హై స్కూల్‌లో బిగినర్స్ కోర్స్ శిక్షణ నిర్వహించారు.. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి పాఠశాల లో స్కౌట్స్అండ్ గైడ్స్ ఏర్పాటు కు అందరూ కృషి చేయాలని కోరారు. విక్షణకు వివిధ మండలాల నుంచి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అందరూ హాజరయ్యారు. కార్యక్రమంలో సెక్రెటరీ భాస్కర్ రెడ్డి, సభ్యులు శ్రీ లక్ష్మీ , పిటిఎం ఎంఇఒ నారాయణ, కొత్తకోట ఎంఇఒ రెడ్డి శేఖర్, జ్ఞానోదయ స్కూల్ కరస్పాండెంట్ ప్రసాద్‌రావు, ఎస్‌టియు అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు



ఇఫ్తార్	షహారీ
సోమవారం (సా)	మంగళవారం (ఉ)
6.30	5.05



లక్క ఇల్లు దహనం నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న లక్క ఇల్లు నాటకం దహనం

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని దేవలంపేటలో వెలసిన శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న మహాభారత యుద్ధంలో భాగంగా నిర్వహించిన నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. పాండవులు లక్కఇంట్లో ఉండగా కౌరవులు వారిని హతమార్చాలన్న ఆలోచనతో లక్క ఇంటికి దహనం చేయడం పాండవులు శ్రీకృష్ణుడు కాపాడడం వంటి సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా శ్రీ వెంకటేశ్వర నాట్య కళామండలి వారిచే రాత్రి నాటక కనులారావించడం చేశారు. ఈ సన్నివేశాలను ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించినట్లు మహాభారత నిర్వాహకులు రామయ్య వెంకటరమణులు తెలిపారు.

గురుకులాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

జిల్లాలోని బాల, బాలికల గురుకుల విద్యాలయాల్లో 5, 6,7,8 తరగతులలో మిగిలి ఉన్న సీట్లకు ఏపిఆర్ఎస్ క్యాట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అన్నమయ్య జిల్లా ప్రవేశపరీక్ష కో-ఆర్డినేటర్ డాక్టర్ యం. చెన్నకేశవులు పేర్కొన్నారు. ఇంటర్‌మొదటి సంవత్సరం ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపులలో గురుకుల జూనియర్ కళాశాలలో చేరుటకు ఈనెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో మరియు జూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకొనుటకు aprs.apcfss.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి ప్రవేశాలకు బాలుర కోసం రాయలసీమలో అన్నమయ్య జిల్లాలోని గ్యారంపల్లి ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల, శ్రీసత్య సాయిజిల్లాలో కొడిగనహళ్లి ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాలలు ఉన్నాయని అన్నారు. బాలికల కోసం కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు దగ్గర బన వాసి గురుకుల జూనియర్ కళాశాల, డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరుటకు బాలురకు పల్నాడు జిల్లాలోని నాగార్జునసాగర్ గురుకుల డిగ్రీ కళాశాల మాత్రమే ఉందన్నారు. నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి, పౌష్టికాహారం అందిస్తారని చెప్పారు. విద్యార్థులకు క్రీడలు, యోగ, ధ్యానం కూడా నేర్పిస్తారని చెప్పారు. ఈ విద్యాసంస్థలలో చేరిన వారికి ప్రభుత్వ ఇచ్చే స్కాలర్‌షిప్‌లు వర్తిస్తాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25న ఉదయం, గురుకుల జూనియర్, డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్ష అదేరోజున మధ్యాహ్నం జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో వివిధ పరీక్ష కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. **పెద్దమండ్యం:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రామాంజులు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎంపిసి, బైపిసి, ఎంఇసి,సిఇసి, గ్రూపులకు ప్రవేశ కల్పించడంతోపాటు పాఠశాలలో బోధన మాధ్యమం ఆంగ్లంలో ఉంటుందన్నారు. ఈనెల 28 నుంచి మే 22వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేవారు జిల్లాలో ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. బిసి, ఒసి విద్యార్థులకు రూ.200, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రూ.150, దరఖాస్తు ధరవత్తు చెల్లించాలన్నారు. పదవ తరగతి అత్యధిక మార్కుల ప్రకారం, రిజర్వేషన్ పద్ధతి ప్రకారం ఇంటర్ మొదటి సంవత్సరానికి ప్రవేశం కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు, ఈ అవకాశం ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కేంద్ర బలగాలతో కలసి కవాతులో పాల్గొన్న పోలీసులు

కలకడలో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడలో పోలీస్ కవాతును నిర్వహించినట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఎన్నికలు సజావుగా జరగాలన్న నేపథ్యంలో పోలీసు కవాతును నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎన్నికల సమయంలో ఎలాంటి కార్యక్రమాలు చోటు చేసుకోకుండా క్రమబద్ధీకరించడానికి కేంద్ర బలగాలు మండలానికి వచ్చి కవాతును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించిన కవాతులో 60 మంది కేంద్ర బలగాలు ర్యాలీలో చేపట్టినట్లు తెలిపారు. ఈ ర్యాలీ బాటవారిపల్లి ఉన్నత పాఠశాల నుంచి కలకడ పురవీధుల్లో పర్యటించి ఆదర్శ పాఠశాల వరకు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణారెడ్డి, హెడ్ కానిస్టే బుళ్ల రమేష్, హరి, రెడ్డి బాబు, నాగరాజా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సమైక్య సంఘం అధ్యక్షులు

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రామసముద్రం దేవరకొండలో ఆదివారం కనక రుద్రమ్మ తిరుణాల సందర్భముగా దాతలు రెండు వేలమందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సమైక్య సంఘ అధ్యక్షులు మల్లు సుబ్బనరసారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తిరు ణాలలో మేము దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుణశేఖర్, కోశాధికారి నరసింహులు, పెనగలూరు అధ్యక్షులు తిరుపాల్, సంఘ సభ్యులు ఆనంద్, జ్యోతీశ్వర్ నాయుడు, శ్రీనివాసులు, వాలంటీర్లు నాగార్జున, మురళీ, సుధ, సాయి కిరణ్, మదన్‌మోహన్ రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి, శివనాయుడు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని శిల్పారామంలో విజిల్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆది వారం శిల్పారామం కళావేదిక పైన చిన్నారులు నృత్యాలతో ప్రేక్షకులను అలరించారు. సందర్శకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. కార్యక్ర మాన్ని శిల్పారామం ఎఒ శివ ప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.



నృత్యాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

క్షయ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

ప్రజాశక్తి- రాజంపేట అర్బన్

అంతర్జాతీయ టిబి దినోత్సవం సందర్భంగా రెవెన్యూ డివిజనల్ అధికారి మోహన్ రావు, డిఎంహెచ్ఒ డాక్టర్ చెన్న కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం రాజంపేట ఏరియా ఆసుపత్రి నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి టిబి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మోహన్ రావు మాట్లాడుతూ టిబి వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం విశేష వైద్య సేవలు అందించిన వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో టిబి వైద్యాధికారి డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ అశ్వినిచంద్ర, స్నేహలత, అశోక్, టిబి సూపర్వైజర్ జయప్రకాష్, సిద్ధి రామయ్య, ఎంఎల్ హెచ్ పిలు, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దామని వైద్యులు పిలుపునిచ్చారు. టిబిడేని పురష్కరించుకొని పిటిఎం పిహెచ్‌లో ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. బెస్ట్ ఎఎన్ ఎంఎంఎల్ హెచ్‌పి, ఆశ ఫీల్డ్ పర్ఫామెన్స్ అవార్డులను ఎంఒటిసి డాక్టర్ శంకర్, డాక్టర్ యస్దదానిలు బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ టిబి సకాలంలో గుర్తించి క్రమ పద్ధతిలో మందులు వాడితే పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. వ్యాధిగ్రస్తులు పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్ర మంలో టిబి సూపర్వైజర్ ఎం.రామకృష్ణ నాయుడు, ఎంపిహెచ్‌ఎస్ విజయ కుమారి, ఎంఎల్ హెచ్ పిలు, ఎఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ :** క్షయ వ్యాధిని అంతం చేయడమే మన పంతమని డాక్టర్ జవహర్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ క్షయవ్యాధి దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పాపిరెడ్డి గారి పల్లి పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బరువు తగ్గుట, పైబడి దగ్గు ఎక్కువ ఉండుట, రాత్రిపూట జ్వరం రావడం, చాతి నొప్పి రావటం, దగ్గినప్పుడు రక్తపడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయ రామయ్య, పిహెచ్‌ఎన్ కె.సుబ్బరత్నమ్మ, స్టాఫ్ నర్స్ జె.భారతమ్మ, హెల్త్ సూపర్వైజర్స్ ఎం.వెంకటేశ్వరరావు, బి.రెడ్డమ్మ ,ఆరోగ్య కార్యకర్తలు ఎన్.వాణి, డి.వరలక్ష్మి, రమణమ్మ, ఆశా కార్యకర్తలు టి.గురుశాంత, పార్వతి, రమణమ్మ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** క్షయ వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సిద్దయ్య పేర్కొన్న పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించి, అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిద్దయ్య మాట్లాడుతూ క్షయవ్యాధి టిబి రోగులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు తుంపర్ల మానవుని శరీరంలో ప్రవేశించి ఇమ్యూనిటీ తగ్గినప్పుడు బ్యాక్టీరియా యాక్టివ్ అవుతుందని అన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, బరువు తగ్గడం దగ్గినప్పుడు ఛాతిలో నొప్పి గళ్ళలో రక్తం రావడం ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి ప్రస్తుతం క్షయ వ్యాధికి అత్యధిక చికిత్స అందుబాటులో ఉన్నదని మూడు నెలల్లో నయమవుతుందని చెప్పారు. క్షయ వ్యాధి గళ్ళ పరీక్ష, ఎక్స్‌రే ద్వారా వ్యాధి నిర్ధారణ చేసుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సిద్దయ్య, డాక్టర్ నజియా, సూపర్వైజర్ మనీ, భరత్, శివ, మలేరియా సబ్‌యూనిట్ అధికారి, ప్రసాద్‌యాదవ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** క్షయ వ్యాధి నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలని డాక్టర్ వెంకటరామయ్య కోరారు.పట్టణంలో వైద్యసిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్లు రిచర్డ్స్, విక్రాంత్ రెడ్డి, రాజు, ఆర్ఎన్టిసిపి సిబ్బంది రామకృష్ణ, యాదగిరి పాల్గొన్నారు.



రాజంపేట : ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌డిఒ



లక్కిరెడ్డిపల్లి: ప్రతిజ చేయిస్తున్న డాక్టర్ సిద్దయ్య

సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగుదాం

ప్రజాశక్తి-కడప అర్బన్

సమాజంలో పేద, బడుగు వర్గాలు ప్రకృతి వైపరీత్యాలకు గురైన ప్రజలకు సేవలు అందించేందుకు లయన్స్ క్లబ్‌లోని అన్ని శాఖలు సమీప జిల్లా శాఖలతో కలిసి ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ప్రాంతీయ సమావేశం ఆదివారం నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ క్లబ్ సభ్యులంతా ఐక్యంగా ఒకేతాటిపై నిలిచి ప్రజలకు సేవలు అందించడంలో ముందుకు సాగాలని సూచించారు. మరో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రామచంద్ర ప్రకాశ్‌రావు మాట్లాడుతూ యేటా సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ఒక్కొక్క సభ్యునికి నాయకుడిగా కార్యక్రమ నిర్వహణకు అవకాశం ఇవ్వాలని సూచించారు. లయన్స్ క్లబ్ జిల్లాశాఖ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజులు మాట్లాడుతూ సభ్యులంతా సేవలు అందించే అంశంలో ఒకరినొకరు సహకరించుకోవాలని సూచించారు. నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను సామాజిక సేవలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్దంగా ఉన్నట్లు తెలిపారు. గూడూరు వాసి పాస్ట్‌జోన్ చైర్మన్ పి.మురళీకృష్ణ నాయుడు కూడా ఆయనను బలపరిచారు. కార్యక్రమంలో రాయచోటికి చెందిన డాక్టర్ హరినాథరెడ్డి, పాస్ట్ క్యాబినెట్ సెక్రటరీ సుబ్రమణ్యం, రాయచోటి, రాజంపేట, ప్రొద్దుటూరు, పులివెందులతోపాటు స్థానిక లయన్స్ సభ్యులు పాల్గొని ఏప్రిల్ 14న నెల్లూరులో జరగనున్న లయన్స్ క్లబ్ ఎన్నికల్లో తప్పక పాల్గొనాలని నిర్ణయించారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నపరెడ్డి

'నేచర్'ను కాపాడకుంటే 'ఫ్యూచర్' కష్టమే



హెరిటేజ్ వాక్‌ను నిర్వహిస్తున్న ఇంటాక్ సంస్థ ప్రతినిధులు, నగర ప్రముఖులు

ప్రజాశక్తి-కడప అర్బన్

మన చుట్టూ ఆవరించుకుని ఉన్న ప్రకృతి కాపాడుకోకుంటే మానవాళికి మనుగడ కష్టమేనని భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా ఛాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి అన్నారు. కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు ఆదివారం ఇంటాక్ జిల్లా చాప్టర్ ఆధ్వర్యంలో స్థానిక పాలకొండల వద్దగల నగరవనంలో సంస్థ సభ్యులు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ప్రకృతి వరప్రసాదమని, ప్రాణంతోపాటు దాన్ని కాపాడుకునేందుకు పంచభూతాల రూపంలో మానవుడికి ఎంతో ఇస్తున్న ప్రకృతిని కాపాడుకునేందుకు తప్పక చర్యలు చేపట్టవలసి ఉందన్నారు. కరువులు, నీటి ఎద్దడి ప్రకృతిని నిర్లక్ష్యం చేసినందుకు ఫలితమేనన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని నేటి తరానికి పరిచయం చేసేందుకు, దాని ప్రస్తుత స్థితిగతులను తెలిపేందుకు ఈ వాక్ నిర్వహించడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప,అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ నదులు, అడవులు లాంటి సహజ వనరులను కాపాడుకునేందుకు పూర్వం ఉత్సవాలు నిర్వహించేవారని గుర్తు చేశారు. అనంతరం వారు జెండా ఊపి హెరిటేజ్ వాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సభ్యులంతా నగర వనంలో దాదాపు మూడు కిలోమీటర్ల దూరం ప్రకృతిని కాపాడాలంటూ నినాదాలు చేస్తూ నడక నిర్వహించారు. అల్పాహారం అనంతరం ప్రకృతిని రక్షించుకోవడంలో భాగంగా ఇంటాక్ చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి చర్చించుకున్నారు. కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, కొండూరు జనార్ధనరాజు, భారవి, ఇంటాక్ జిల్లా కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, బోగాల కొండారెడ్డి, రాఘవేంద్ర వర్మ, ఎల్ఐసీ రఘునాథరెడ్డి, యల్లేశ్వరరావు, నాగవేణి, అరుణ పాల్గొన్నారు.

యానాదుల సంక్షేమానికి పాటుపడుదాం

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో అత్యంత వెనుకబడి, ధీనావస్థలో జీవనం సాగిస్తున్న గిరిజన యానాదుల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడదామని 'గిరిజన యానాది సంఘాల మహాకూటమి' రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు బాపట్ల వెంకటపతి, పరమాల గోపి అన్నారు. ఆదివారం పీలేరులో ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు జానం గంగిరెడ్డి ఆధ్వర్యంలో గిరిజన యానాది మేల్కొలుపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా గిరిజన యానాదుల బతుకుల్లో మార్పు లేదని అన్నారు. ఇప్పటికీ వారి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారిందని అన్నారు. రాష్ట్రంలో యానాదులు అత్యధిక శాతం ఉన్నప్పటికీ వారికి రాజకీయ సాధికారత లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. చట్టసభల్లో యానాదుల పక్షాన మాట్లాడే గొంతుక లేకపోవడం చాలా బాధాకరమని చెప్పారు. తమ జాతిని తామే ముందుకు నడిపించే బాధ్యతను తీసుకుని, రాష్ట్రంలోని 28 గిరిజన యానాది సంఘాలు కలిసి మహాకూటమిగా ఏర్పడిందని తెలియజేశారు. భవిష్యత్తులో యానాది సంఘాల మహాకూటమి రాజకీయ పార్టీగా అవతరించబోనుందని తెలిపారు. అనంతరం యానాది సంఘాల మహాకూటమి అన్నమయ్య జిల్లా శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్నమయ్య జిల్లా చైర్మన్‌గా గడ్డం శ్రీనివాసులు, అధ్యక్షులుగా కుప్పం రాజేశ్వరప్ప, ప్రధాన కార్యదర్శిగా గాలేటి వెంకటేశ్వర, కోశాధికారిగా గానుగపెంట సిద్దు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నచ్చుకూరి రెడ్డప్ప, జాయింట్ సెక్రటరీగా ముత్యం తిరుపాల్, కార్యదర్శిగా నగిరిపాటి వెంకటేష్, గౌరవాధ్యక్షులు, మీడియా సమన్వయకర్తగా జానం గంగిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా నూతన యానాది సంఘాల మహాకూటమి నాయకులు మాట్లాడుతూ తమను ఈ పదవులు మరింత బాధ్యత పెంచాయని, యానాది జాతి సంక్షేమం, అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సంఘం నాయకులు డాక్టర్ వెంకటరమణ, నారాయణమ్మ, టేకుమంద రెడ్డప్ప, పాపయ్య, నిమ్మనపల్లి రెడ్డప్ప, సోమల గంగులప్ప, ఆదినారాయణ, మహాకూటమి రాష్ట్ర నాయకులు చలంచర్ల ప్రసాద్, ఇండ్ల వెంకట సుబ్బారావు, పారాల పరమేశం, ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి గిరిజన యానాది నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న గిరిజన యానాదుల సంక్షేమ సంఘం నాయకులు

రాజంపేట అసెంబ్లీ సీటు జనసేనకు కేటాయించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర రాజకీయాలను శాసించే రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ సీటును జనసేన పార్టీకి కేటాయించాలని ఆ పార్టీ నాయకులు కోలాటం హరికృష్ణ, కత్తి సుబ్బరాయుడు, ఆకుల చలపతి, గురువుగారి వాసు, ఇడిమడకల సాయి శ్రీనివాస్ కోరారు. ఆదివారం మన్నూరులోని యల్లమ్మ ఆలయం వద్దనున్న జనసేన పార్టీ కార్యాలయం యల్లటూరు భవనంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి రాజంపేటలో పార్టీ తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర రాజకీయాలను శాసించే సత్తా కలిగిన రాజంపేట నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిత్వాన్ని జనసేనకు కేటాయిస్తే రాష్ట్రంలోని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని తమ నాయకుడు పవన్ కళ్యాణ్‌కు కానుకగా అందజేస్తామని తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట జనసేనకు అత్య ధిక ఓటు బ్యాంకు కలిగి ఉందని, అన్ని వర్గాల ప్రజలు ఇక్కడ జనసేన పార్టీని ఆదరిస్తున్నారని తెలిపారు. ప్రజాదరణ కలిగిన రాజంపేట నియోజకవర్గం జనసేనకు కేటాయిస్తే అఖండ మెజారిటీతో గెలిపించుకుని జనసేన జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రశాంత్ భారతాల, పలుకూరి శంకర్, బండ్ల రాజేష్, నంద్యాల హరి, ఏనుగుల మల్లి, గాజుల మల్లికార్జున, ముత్యాల చలపతి, పూల మురళీ, నామాల శంకర్, రాజేష్ వర్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశకి-రామసముద్రం

మండల పరిధిలోని ఆంధ్రప్రదేశ్-కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు మదనపల్లి డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కారణంగా సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. సరిహద్దు మార్గాల ద్వారా బహుమతులు రూపంలో చీరలు గడియారాలు, బంగారం , కుక్కర్లు , మిక్సీలు, అక్రమ మద్యం తదితర వస్తువులు తరలింపుపై నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి ఎవరైనా అతిక్రమించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ అరికట్టేందుకు సిబ్బంది సమాయత్తం కావాలని సూచించారు. కార్యక్రమంలో మదనపల్లి రూరల్ సిఐ సద్గురుడు, ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

బాధితులకు అండగా ఉంటాం:'కొరముట్ల'

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ముక్కావారిపల్లి దళితవాడలో నివాసమున్న కప్పల గంగమ్మ ఇల్లు ప్రమాదవశాత్తు అగ్నికి గురి కావడంతో ఆదివారం ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆదుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పక్కా ఇల్లు కట్టించి ఆర్థికంగా ఆదుకుంటామని హామీనిచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డికి, స్థానిక శాసన సభ్యుడైన తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. నియోజవర్గాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలో తన వద్ద మ్యాప్ ఉందని తెలిపారు. అగ్నికి గురైన కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, వైస్ ఎంపిపి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మారే సుకుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు, వాహనదారులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఇసుక రీచ్‌ల్లోనే ఇసుక కొనుగోలు చేయాలని మైదుకూరు డిఎస్‌పి టి.వెంకటేశులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా సరియైన బిల్లులు కలిగి ఉండాలన్నారు. అనుమతి లేని ఇసుక రీచ్‌ల నుండి ఇసుక తరలిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఉచిత శిక్షణ కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం వారి సహకారంతో, స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 10వ తరగతి పరీక్షలు రాసి ఉన్నత చదువుల కోసం ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. పాలీసెట్, ఎపిఆర్‌సెట్ ప్రవేశాలకు 14ఏళ్లుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమం ఈ నెల 28 నుండి ప్రారంభం కానున్నట్లు సేవాసమితి అధ్యక్షులు రాజు ఆదివారం తెలిపారు. ఆ మేరకు కరపత్రాలను ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఎస్‌వి సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర్‌రెడ్డి, శ్రీదేవి, సుబ్బిరెడ్డి, రాజు విడుదల చేశారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని సిద్దేశ్వర థియేటర్ సమీపంలోని ప్రధాన రహదారిలో ఆదివారం ఆర్‌టిసి బస్సు కిందపడి యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప నుంచి తిరుపతి వైపు మోటార్ బైకులో అభిరామ్(23)అనే యువకుడు వెళుతుండగా రైల్వే కోడూరు పట్టణంలోని లక్ష్మీ ప్యారడైజ్ సినిమా హాలు వద్దకు రాగానేపట్టణంలోని ధర్మాపురంకు చెందిన వెంకటేష్ అనే యువకుడు అభిరామ్‌ను ఆపి లిఫ్ట్ అడిగాడని అన్నారు. ఇద్దరూ మోటార్ సైకిల్ పై వెళుతుండగా వీరికి ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసి వెళుతున్న సమయంలో అదే సమయానికి తిరుపతి నుంచి కడప వైపు వెళుతున్న ఆర్‌టిసి బస్సు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో బస్సు కింద పడ్డారని తెలిపారు. ఈ ప్రమాదంలో అభిరామ్ అక్కడికక్కడే మృతి చెందగా, మోటార్ సైకిల్‌లో వెనక ఉన్న వెంకటేష్ కి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని చెప్పారు.మృతుడు అభిరామ్ స్వగ్రామం నెల్లూరు జిల్లా రాపూరు మండలం మలలగుంట గ్రామంగా గుర్తించినట్లు చెప్పారు. సమాచారం తెలుసుకున్న రైల్వే కోడూరు సిఐ టి.బాబు తన సిబ్బందితో ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

పుల్లంపేట : మండల పరిధిలోని రాఘవరాజుపురం గ్రామానికి చెందిన కవులూరు నాగేశ్వర్‌రెడ్డి పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై కోడూరు నుంచి రాయచోటికి వెళ తున్న సమయంలో మంగంపేట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని పక్కనే ఉన్న కాలువలో పడిపోయి మృతి చెందిన సంఘటన వెలుగు చూసింది. మృతి చెందిన విషయం ఎవరికీ తెలియక పోగా సాయంత్రం సమయంలో అటుగా వెళుతున్న కొందరు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలాన్ని కొరముట్ల శ్రీనివాసులు, స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని పట్ల సమాచారాన్ని ఆరా తీశారు. స్థానిక ఎస్ఐ ఈ ఘటనపె కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైస్ ఎంపిపి రాజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, రాజారెడ్డి, రవి చంద్రారెడ్డి ఉన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు